విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

ప్రభుత్వ స్థలాలను పకోడీలా అమ్మేసుకున్న వ్యక్తి?

92వ వార్డులో ఒకే పట్టాతో ఏడుగురికి విక్రయాలు

అధికారుల హెచ్చరికలు భేఖాతరు

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 92వ వార్డులో ప్రభుత్వ స్థలాలకు రెక్కలు వచ్చాయి. ఒకే వ్యక్తి ఏకంగా ఏడు స్థలాలు విక్రయించి కోట్లు కొల్లగొట్టారు. స్థానికులు సమాచారం ప్రకారం...జనతా కాలనీ రోడ్డు నెంబరు- 8 లో, సర్వే నెంబరు 76/1ఏలో ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉంది. స్థానికంగా ఉన్న రాజు అనే వ్యక్తి ఆ స్థలాన్ని ఆక్రమించగా రజక సంఘ సభ్యులు ఫిర్యాదు మేరకు అప్పటి జోనల్ కమిషనర్ చక్రవర్తి, రెవెన్యూ సిబ్బంది పరిశీలించి ఆక్రమణలను తొలగించారు. దాన్ని ప్రభుత్వ స్థలంగా నిర్ధారించి హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. స్థానిక వైసీపీ నాయకుడు బెహరా భాస్కరరావు కూడా ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురి కాకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా ఆ స్థలంలో కొందరు వ్యక్తులు షెడ్లు వేయడానికి ప్రయత్నించారు. దీంతో రజక సంఘం సభ్యులు అధికారులకు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యులు బెహరా భాస్కర్రావుకు సమాచారమందించారు. దీనిపై స్పందించిన భాస్కరరావు ప్రభుత్వస్థలం ఆక్రమణకు గురి కాకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. బెహరా ఆదేశంతో అక్కడికి చేరుకున్న రెవిన్యూ, జివిఎంసి అధికారులు మొక్కుబడిగా రేకులు కింద పడేసి వెళ్లిపోయారు. అంతే తప్ప ఆక్రమణదారుపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిచ్చింది. ఆక్రమణదారుతో అధికారులు కుమ్మ క్కయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఆ స్థలాన్ని ఆక్రమించుకున్న రాజు ఒకే పట్టా చూపించి ఏడు స్థలాలను విక్రయించినట్లు సమాచారం. ప్రభుత్వ స్థలాలను పకోడీ ముక్కల్లా అమ్మేసుకున్న రాజుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చాపరాయిలో చిరు వ్యాపారులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: మండల కేంద్రంలో చాపరాయి వద్ద పకృతి అందాలు తిలకించడానికి దేశ విదేశాల నుండి చాలామంది పర్యాటకులు వస్తూ ఉంటారని చాప రాయిని మూసివేయడం వలన చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని కాంగ్రెస్ నాయకురాలు పాచిపెంట శాంతికుమారి అన్నారు. సుమారుగా 120 కుటుంబాలు ఆధారపడి జీవనోపాధి సాగిస్తున్నారని అన్నారు. చాపరాయి పరిశుభ్రంగా లేదని మూసి వేయాలని కలెక్టర్ ఆదేంచిన విషయం తెలిసిందే. యథా విధిగా చాపరాయిని తెరిచి గిరిజన చిరు వ్యాపారస్తులకు జీవనోపాధి కల్పించాలని మంచినీరు మౌలిక సదుపా యాలు కల్పించాలని అన్నారు. ఇది తెరవకపోవటం వలన చాపరాయి టెండర్ యజ మాని సుమారు 32 లక్షలు ప్రభుత్వానికి చెల్లించి ఉన్నారని అతను కూడా ఇది తెరవకపోవడం వలన మానసికంగా, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు బాకా సులోచన, చిరు వ్యాపారస్తుల సంఘం ప్రతినిధులు కిల్లో నలమ్మ, కమ్మిడి, సుమన్, ఎస్.కె.సీతమ్మ, శెట్టి కుమారి పాల్గొన్నారు.

గొట్టిపల్లిని సందర్శించిన ఉన్నత భారత్ అభియాన్ బృందం

విశాలాంధ్ర - ఆనంద పురం: విశ్వ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉన్నత భారత్ అభి యాన్ రీజినల్ కార్యాలయం సిబ్బంది గొట్టిపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం పార్టిసిపెంట్ ఇనిస్ట్యూట్ ఐఏఎస్‌సి బృందం గ్రామీణ సర్వే నిర్వ హించారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు సమస్యలను గుర్తించి భారత్ అభియాన్ నివేదిక పంపించనున్నట్లు తెలిపారు. బాకురుపాలెం, గొట్టివల్లి, గోరింట, గంగసాని అగ్రహారం, భీమన్నదరపాలెం తదితర గ్రామాలను దత్తత తీసుకు న్నారు. పంచాయతీ కార్యదర్శి సురేష్ మాట్లా డుతూ గొట్టిపల్లి గ్రామంలో మంచినీరు, డ్రైనేజీ సమస్య ఉందని సర్వే బృందానికి తెలిపారు. ఈ కార్యక్రమంలో యూబీఏ సమన్వ యకర్తలు డాక్టర్ సోనీ హవీలా, పావని, లైబ్రేరియన్ యర్రాజి రెడ్డి పాల్గొన్నారు.

మెటీరియల్ చోరీ చేస్తే చర్యలు

సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్

విశాలాంధ్ర - రావికమతం: రోడ్డు విస్తరణ పనుల్లో వాడే స్టీల్ ప్లాస్టిక్ మెటీ రియల్ చోరీ చేసినా వాటిని కొన్నాసరే వ్యాపారులను అరెస్ట్ చేస్తామని కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ హెచ్చరించారు. రావికమతంలో ఆయన విలేకర్ల సమావేశాన్ని గురువారం ఏర్పాటు చేశారు. న్యూడెవలప్మెంట్ బ్యాంకు నిధులతో వడ్డాది నుంచి వెలంకా యపాలెం వరకూ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే కాంట్రాక్టర్ ప్రస్తుతం పలు చోట్ల మదుములు నిర్మిస్తుండగా కొంతమంది తాగు బోతులు, చిల్లర దొంగలు ఆయా ప్రాంతాల్లో ఉండే స్టీల్ ప్లాస్టిక్ సామా న్లను దొంగిలిస్తున్నట్టుగా సదరు కాంట్రాక్టర్ తనకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. రోడ్లు శరవేగంగా పూర్తయ్యేందుకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో రికార్డుల హోరు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ సిబ్బంది సమిష్టి కృషితో బ్లాస్ట్ ఫర్నేస్ 1, 2 నుండి (రెండు ఫర్నేస్‌లు కలిపి) 2022 డిసెంబర్ 7న ఒక్క రోజులో 15,700 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తిని సాధించడం ద్వారా మరో రికార్డును సృష్టించింది. డిసెంబర్ 7న ఒక్క రోజులో సాధించిన 15,700 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి (100% కంటే ఎక్కువ సామర్థ్యం వినియోగం) ప్లాంట్ ప్రారంభం నుండీ బ్లాస్ట్ ఫర్నేస్ 1, 2 నుండి ద్వారా (రెండు ఫర్నేస్ ల సమిష్టి ఉత్పాదన) ఇప్పటి దాకా ఒక రోజు దినసరి ఉత్పాదనలో అత్యధికం, అత్యుత్తమ ఉత్పాదన. ఇంతకుముందు ఉత్తమ రోజువారీ హాట్ మెటల్ ఉత్పత్తి బ్లాస్ట్ ఫర్నేస్ 1, 2 కలిపి 15,440 టన్నుల ఉత్పాదన 20.02.2022న సాధించారు. గణనీయమైన రికార్డు ఉత్పత్తిని సాధించినందుకు కార్మికులను, అదికార్లును విశాఖ ఉక్కు సీఎండీ అతుల్ భట్ అభినందించారు.



కేకే రాజుకు బెహరా శుభాకాంక్షలు

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ ఉత్తర నియోజ కవర్గం వైసీపీ సమన్వ యకర్త కేకే రాజు పుట్టినరోజు సందర్భంగా జీవీఎంసీ కో-ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీని వాసరావు, వైసీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణి కుమారి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వృధా అవుతున్న మంచినీరు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 59వ వార్డు జింక్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం స్థానికంగా సరఫరా అవుతున్న మంచినీటి పైపులైను తుప్పుపట్టి మంచినీరు వృథాగా పోయింది. దీన్ని ఆపేందుకు స్థానికులు కవర్లు చుట్టే ప్రయత్నం చేసినప్పటికీ నీరు రోడ్డుపై చిమ్మడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించకపోతే పారిశ్రామిక ప్రాంతం పరిధిలో సరఫరా మంచినీరు వృధా అయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీలేరు కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ సీఈగా కెవి.నాగేశ్వరరావు

విశాలాంధ్ర - సీలేరు: ఏపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ సిఈగా కెవి.నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల వరకు ఇన్‌చార్జ్ సీఈగా కొనసాగిన కె.వెంకటేశ్వరరావు తన వ్యక్తిగత పనులపై విదేశాలకు వెళ్లారు. ఈ మేరకు ఏపి జెన్‌కో విద్యుత్ సౌదా ఉన్నతాధికార్లు ఆ బాధ్యతలను మాచ్‌ఖండ్ ఎస్ఈ (ఓఅండ్ఎం) కెవి.నాగేశ్వరరావుకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కెవి.నాగేశ్వరరావు సీలేరు కాంప్లెక్స్ సిఈగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు, డొంకరాయ, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాల్లోని పలువురు ఇంజనీర్లు, కార్మిక సంఘాల నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

వ్యాన్-బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర - ముంచంగిపుట్: మండల పరిధిలో గల బంగారు మెట్ట పంచాయతీ కుజబంగి కూడలి వద్ద గురువారం ఉదయం వ్యాన్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారు పెదబయలు మండలం జామిగూడ పంచాయతీ గుంజివాడ గ్రామానికి చెందిన జర్సింగి భాస్కరరావు (26), జర్సింగి చంద్రమౌళి (30)లు వ్యక్తిగత పనుల నిమిత్తం గుంజివాడ నుండి కుజబంగి మీదుగా పెద బయలు వెళ్లేందుకు గురువారం ఉదయం బయలుదేరారు. ఈ క్రమంలో కుజబంగి కూడలి వద్దకు వచ్చేసరికి పెదబయలు నుండి ముంచంగిపుట్టు వైపు వస్తున్న వ్యాన్ ఒక్కసారిగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నుజ్జు నుజ్జు అయ్యాయి. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు చెల్లాచెదురుగా పడిపోయారు. క్షతగాత్రులను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. స్టాఫ్ నర్స్ లలిత, సిబ్బంది కె.వంశీ, లింగన్నలు వైద్య సేవలందించారు.

మ్యుటేషన్ పనులు వేగవంతం చేయాలి

సీసీఎల్ఏ కమిషనర్ సాయి ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష (రి సర్వే) లో భాగంగా మ్యుటేషన్ల పనులు వేగవంతం చేయాలని సిసిఎల్ఎ కమిషనర్ సాయి ప్రసాద్ ఆదేశించారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష (రి సర్వే) ప్రగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో విజయవాడ నుంచి గురువారం వీడియో కాన్ప రెన్స్ నిర్వహించారు. మ్యుటేషన్లు, పట్టాలకు సంబం ధించిన పనులు వేగవంతం చేయా లని ఆయన పేర్కొన్నారు. పలు అంశాలపై ఆయన చర్చించారు. వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పనకు ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో భూసర్వే పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కే.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, సర్వే విభాగం సహాయ సంచాలకులు ఆర్.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన ఐర్లాండ్ సెనేటర్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వ విద్యాలయాన్ని ఐర్లాండ్ దేశ సెనేటర్ మాల్కం బైరన్‌తో కూడిన ప్రతినిధుల బృందం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఏయూ అధికారులతో పాలక మండలి సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సెనేటర్ మాల్కం బైరన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడానికి ఏయూ చేస్తున్న కృషిని అభినందించారు. ఏయూతో కలసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహిస్తున్న విధానాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, ఎస్.కె భట్టి, ఐర్లాండ్ ప్రతినిధి డేవిడ్ ఫాలెన్, అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏయూ తరఫున ఐర్లాండ్ సెనేటర్‌ను సత్కరించారు.

భూముల సాగుదారుల వివరాలు నమోదు

సీపీఐ విజ్ఞాపనతో కలెక్టర్ ఆదేశాలు

విశాలాంధ్ర - కె.కోటపాడు: బంజరు భూముల్లో ఉన్న సాగుదారులు ఎవరు? ఎన్ని సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారు.. ఆ భూముల్లో ఉన్న పంటల వివరాలు సమగ్రంగా పరిశీలించారు రెవెన్యూ అధికారులు. కె.కోటపాడు మండలంలో గత 30 సంవత్సరాలుగా అనే కమంది పేదలు బంజరు భూములు సాగు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నారు. వారందరికీ పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వం నుండి వచ్చే అనేక రాయితీలు కల్పించాలని మండల సీపీఐ ఎన్నో ఉద్యమాలు చేపట్టింది. అనేకసార్లు రైతులను వెంటబెట్టుకుని రెవెన్యూ కార్యా లయం వద్ద ధర్నాలు నిర్వహించింది. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో అప్పటి సిపిఐ ఎమ్మెల్యేలు చాడ వెంకటరెడ్డి, గొట్టేటి దేముడులు ముఖ్యమంత్రిని కోరిన మీదట అప్పటి రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మండలంలోని సుమారు 500 ఎక రాలు పేదలకు పంచారు. నాటినుండి నేటి వరకు పట్టాలు పంపిణీ ఊసే లేదు. ఇటీవల సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు నేతృత్వంలో మండల సీపీఐ నాయకులు రైతులను వెంటబెట్టుకుని అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. పట్టాలు మంజూరు చేయకపోవడంతో అనేకమంది పేదరైతులు రైతు భరోసా నిధులతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలకు నోచుకోవడం లేదని వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గురువారం మర్రివలస గ్రామంలో రెవెన్యూ అధికారులు బంజరు భూములను పరిశీలిం చారు. సాగుదారుల వివరాలు నమోదు చేసుకున్నారు. సీపీఐ మండల కార్యదర్శి గొర్లే దేముడు బాబు మాట్లాడుతూ మర్రి వలస గ్రామం తో పాటు ఆర్లే , సూది వలస, పాతవలస, దాలివలస, కె.సంతపాలెం, కింతాడ గ్రామా ల్లో కూడా సాగుదారులు వివరాలు కలెక్టర్‌కు పంపాలని రెవెన్యూ అధికారులను కోరారు. వీరి వెంట సీపీఐ సీని యర్ నాయకులు వేచలపు కాసుబాబు, రెడ్డి అప్పల నాయుడు, పొంతపల్లి రామారావు, ఇల్లాకు రాము, రాము నాయుడు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణం కమనీయం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి సన్నిధిలో గరుడ సేవ, నిత్య కళ్యాణం ఘనంగా జరిగాయి. వేదపండితుల వేద మంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ వేకువ జామున సింహాద్రి నాధుని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తులు శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు.

పుస్తకం స్నేహితుడితో సమానం

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనలో నగర సీపీ శ్రీకాంత్

విశాలాంధ్ర - విశాఖ: పుస్తకం మంచి స్నేహి తుడితో సమానమని, ప్రతి ఒక్కరూ మంచి పుస్తకాన్ని ఎంచుకోవాలని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. విశాలాంధ్ర విశాఖ 21వ పుస్తక మహోత్సవాన్ని గురువారం ఉదయం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచుకోవాలని, పుస్తకం మంచి స్నేహితుడితో సమానమని, పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం సాధ్యపడుతుందని అన్నారు. డిజిటల్ పఠనం కంటే సాధారణ పుస్తక పఠనం ఎంతో శ్రేయస్కరమని అన్నారు. ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, విశాలాంధ్ర బ్యూరో పి.రామకృష్ణ, బుక్ హౌస్ మేనేజర్ పిఎ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్వో ఆత్మహత్యకు కారణాలేంటి...?

సమగ్ర విచారణ జరపాలి: గిరిజన సంఘం

విశాలాంధ్ర - పెదబయలు: అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండల తహశీల్దార్ ఓ.శ్రీనివాసరావు ఆత్మహత్యకు గల కారణాలేంటని, అసలు ఐటీడీఏ పీఓ రివ్యూ మీటింగ్‌లో ఏం జరిగిందో తెలియడం లేదని దీనిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నాయకులు కొమ్మ పృథ్వీరాజు, బోండా సన్ని బాబు, కిలో సర్బన్న డిమాండ్ చేశారు. గురువారం ఉదయం 9 గంటలకు ఎమ్మార్వో నివాసం ఉంటున్న గది ఎదురుగా ఉన్న రేకుల షెడ్డులో బట్టలు ఆరబెట్టే త్రాడుతో వేలాడుతూ విగత జీవిగా ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. పాడేరులో సోమవారం జరిగిన రెవెన్యూ అధికారుల రివ్యూ మీటింగ్‌లో ఐటిడిఎ పిఓ రోణంకి గోపాల కృష్ణ పెదబయలు మండలానికి సంబంధించి గ్రామాలలో జరుగుతున్న రీ సర్వే విషయమై అందరి ముందు గట్టిగా మందలించడం వల్ల మానసిక క్షోభకు గురై ఆరోజు నుండి అనేక మందికి ఫోన్ చేసి నేను చచ్చిపోతాను అంటూ తరచూ అనడంబట్టి మానసిక స్థైర్యాన్ని నింపే ప్రయత్నం చేశామని సంబంధిత రెవెన్యూ అధికారులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గతంలో జరిగిన అనేక మండల పాలకవర్గాల సమావేశాల్లో సభ్యులు వ్యక్తపరిచిన వివిధ రెవెన్యూ సమస్యలు పెండింగ్లో ఉండడం వీటితోపాటు ఇతర ఏవైనా బలమైన కారణాలు ఉండవచ్చని అన్నారు. వెంటనే విచారణ జరపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు చెండ రామారావు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టుకు షోకాజ్ నోటీసులు

కాలం చెల్లిన మందులను గుర్తించిన అధికారులు

విశాలాంధ్ర-యలమంచిలి: పట్టణ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఫార్మాసిస్ట్‌కు ఉన్నతాధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై ఆసుపత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ సురేఖని ఫోన్‌లో వివరణ కోరగా తాను మూడు రోజుల క్రితం ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించానని, రోజువారీ తనిఖీల్లో భాగంగా ఆసుపత్రిని పరిశీలిస్తుండగా వేరే రూమ్‌లో మందుల పెట్టెలు ఉండటం గమనించి, వాటిని తనిఖీ చేయగా కాలం చెల్లినట్టు గుర్తించినంతరం ఉన్నతాధికారులకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అధికారులు వచ్చి మందుల వివరాలు సేకరించి ఆ గదికి తాళం వేసుకుని వెళ్లిపోయారని దానితో పాటుగా అదే రోజు జిల్లా కలెక్టర్ తనిఖీ కూడా జరిగిందన్నారు. ఇదే విషయంపై గురువారం ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఫార్మాసిస్టు రవీంద్రనాథ్‌కి షోకాజ్ నోటీసులు జారీ చేశానన్నారు.

మాకు డాక్టర్ నెలకు సరిపడా మాత్రలు ప్రిస్క్రిప్షన్‌లో రాస్తే ఫార్మాసిస్టు మాత్రం అందులో కోత విధించి సగం మందులు మాత్రమే ఇచ్చి పంపిస్తుంటారు. డాక్టర్ రాసినన్ని మందులు ఇవ్వాలని చాలాసార్లు అడిగాను. అయినా ఇచ్చేవారు కాదు. ఒక కాగితం రాసి ఇవ్వండి. నేను సూపరింటెండెంట్‌కి తెలియజేస్తామని చెప్పినప్పటికీ మందులిచ్చేవారు కాదు.

– తాతారావు, యలమంచిలి

యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. గతంలో ఇక్కడ పనిచేసిన చిన్న పిల్లల డాక్టర్ వినోద్ కుమార్ బదిలీపై వెళ్ళిపోవడంతో నేటి వరకు ఎవరూ లేరు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చిన్నపిల్లల డాక్టర్‌ని రెగ్యులర్ ఉండేటట్లు నియమించాలి.

– స్థానికుడు, యలమంచిలి

స్నేహితులే హంతకులై ప్రాణం తీసారు

నర్సీపట్నం డీఎస్పి కె.ప్రవీణ్‌కుమార్

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో జరిగిన చిరుకూరి చిన అప్పారావు హత్యను పోలీసులు ఛేదించారు. చిన అప్పారావు స్నేహితులే హత మార్చినట్లు నర్సీపట్నం డీఎస్పి కె.ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పి ప్రవీణ్‌కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన అంబేద్కర్ కాలనీలో చిరుకూరి చిన అప్పారావుని గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో కొట్టి చంపినట్లుగా మృతుడు కుమార్తె ఇంజరపు శ్రీదేవి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో సీఐ అప్పలరాజు ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి కేసును ఛేదించినట్లు తెలిపారు. చిన అప్పారావుకి మండలంలోని మంగవరం గ్రామానికి చెందిన బద్దా శ్రీను అలియాస్ అబ్బాస్, అచ్యుతాపురంకు చెందిన కోనేటి పెదబాబు అలియాస్ జానీ స్నేహితులు ఉన్నట్లు తెలిపారు. వీరు ముగ్గురు కలిసి ఏజెన్సీ నుండి గంజాయి తీసుకొచ్చి అమ్మకాలు చేయడమే కాకుండా, విపరీతంగా గంజాయి సేవించేవారని తెలిపారు. అయితే చేసే గంజాయి వ్యాపారంలో డబ్బులు పంచుకునే విషయంలో చిన అప్పారావుకు, పెదబాబు మధ్య వివాదం జరిగినట్లు తెలిపారు. పెదబాబును చిన అప్పారావు కాలితో తన్నినట్లు తెలిపారు. దీంతో ఆవేదన చెందిన పెదబాబు అదే రోజు రాత్రి ముగ్గురు కలిసి ఫూటుగా మద్యం సేవించి ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయినట్లు తెలిపారు. తెల్లవారు జామున 3గంటల సమయంలో చిన అప్పారావు నిద్రిస్తున్న గది వద్దకు బద్దా శ్రీను, పెదబాబు ఇద్దరూ వచ్చి పక్కనే ఉన్న బండరాయిని తీసుకొని తలపై చిన అప్పారావును కొట్టి హత్య చేసినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహించి హత్యకు సంబంధం ఉన్న బద్దా శ్రీను, కోనేటి పెదబాబులను అరెస్టు చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు డీఎస్పి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ అప్పలరాజు, ఎస్సైలు రమేష్, జోగారావు, సత్యనారాయణ, ఎస్సై గోవిందరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

పులగాలపాలెం రోడ్డు పూర్తయ్యేది ఎప్పుడు?

అధికారుల తీరుపై కార్పోరేటర్ పీలా అసహనం

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 96వ, వార్డు పులగాల పాలెం రోడ్డు నిర్మాణంలో అధికారుల అలసత్వంపై స్థానిక కార్పొరేటర్, జీవీఎంసీ టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు అసహనం వ్యక్తం చేశారు. గురువారం రోడ్డు పనులు పరిశీలించిన శ్రీనివాసరావు ఆక్రమణలు తొలగింపులో నిర్లక్ష్యం చూపుతున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణానికి 1.98 కోట్లు జీవీఎంసీ నిధులు మంజూరు చేసిందని, అలాగే విద్యుత్ స్తంభాలు మార్పునకు మరో 45 లక్షలు నిధులు విడుదలైనాయని చెప్పారు. 60 అడుగుల వెడల్పుతో ఈ రోడ్డు నిర్మాణాన్ని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, తాను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించామని చెప్పారు. అయితే అధికారులు ఆక్రమణ తొలగింపులో నిర్లక్ష్యం వహించడంతో 42.5 అడుగులు మేరకే రోడ్డు నిర్మాణం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత ఆస్పత్రి వద్ద మరింత ఇరుకుగా రోడ్డు నిర్మాణం జరుగుతోందని మండిపడ్డారు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి రోడ్డంతా ఒకేలా నిర్మించాలని లేకుంటే స్థానికులతో కలిసి ఆందోళన చేపడతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి యువజన నాయకుడు పీలాజితేంద్ర, నాయుకులుఆళ్ల రమేష్, కిల్లి రమేష్, రాజేంద్రప్రసాద్, అచ్చిబాబు, పవన్ తదితరులు పాల్గొన్నారు

30న ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు

విశాలాంధ్ర - కె.కోటపాడు: ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర సదస్సు ఈనెల 30వ తేదీన తిరుపతిలో జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు స్థానిక సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆనాటి సదస్సులో ఉద్యోగులకు సంబంధించి అనేక సమస్యలపై చర్చించడం జరుగుతుందని జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఉద్యోగులందరూ హాజరు కావాలని కోరారు.

రాజ్మా, వలిసెలకు గిట్టుబాటు ధర కల్పించాలి

విశాలాంధ్ర - జికేవీధి: అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలో వాణిజ్య పంటలుగా రాజ్మా, వలిసెలు, మినుములు, కందులు తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని జికేవీధి మండల టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు గుంట బుజ్జిబాబు ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన రైతులు ఎక్కువగా పండించే వాటి మీద వచ్చే ఆదాయంలోని గిరిజన రైతాంగం జీవనం సాగిస్తుందన్నారు. కావున గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముక్కలి కళ్యాణి, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పాండురాజు సురేష్, మాజీ జిల్లా టిడిపి కార్యదర్శి ముక్కలి మహేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో బోయపాలెం, గంభీరం, ఏపీఐఐసీ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు, సురేష్‌కుమార్ తెలిపారు. పారిశ్రామిక వినియోగదారులు, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాలుగు ఆటోలు, రెండు స్కూటీలు వేలం పాట



విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలో గల స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు ఆటోలు, రెండు స్కూటీలు వేలం పాట వేస్తున్నట్లు స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో సారా కేసుల్లో పట్టుబడ్డ ఈ వాహనాలను ఈ నెల 13వ తేదిన ఉదయం 10 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో వేలం వేస్తున్నామని ఆశక్తి గల వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో 8 గంటలకు హాజరు కాగలరని వారు కోరారు.

మంటల్లో చిక్కుకొని యువతి మృతి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ 14వ వార్డు పరిధి బిలాల్ కాలనీ వద్ద యువతి ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకొని మృతి చెందింది. ఘటనకు సంబంధించి ఫోర్త్ టౌన్ పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిలాల్ కాలనీ ప్రాంతానికి చెందిన సబ్బి వెంకట్రావు కుమార్తె రమా (19) వికలాం గురాలు. కాగా గురువారం కావడంతో యువతి తల్లిదండ్రులు ఇంట్లో పూజ మందిరం వద్ద దీపం పెట్టారు. అనంతరం పనుల నిమిత్తం ఇంటి నుండి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో దీపాలు పూరింటికి తాకడంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాదంలో మంటల్లో చిక్కుకొని యువతి రమా అక్కడికక్కడే సజీవ దహనం అయింది. ప్రమాదంలో మృతురాలి నానమ్మ చానమ్మ (75)కు, సోదరుడు శేఖర్ (14)కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఫోర్త్ టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-యలమంచిలి: మార్గశిర మాసోత్సవాలులో భాగంగా గురువారం మార్గశిరమాస మూడో గురువారం కావడంతో పట్టణ ధర్మవరం వీధిలో కొలువైయున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో తెల్లవారు జామున నుండి అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. పాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ వారు అన్నిరకాల సౌకర్యాలను కల్పించడంతో పాటుగా అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ, మంచినీటి సదుపాయం కల్పించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

విశాలాంధ్ర-యలమంచిలి రూరల్: నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన బాధితులు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే యూ.వి.రమణమూర్తి రాజు (కన్నబాబు) అందజేశారు. సుమారు రూ.6.70లక్షల విలువజేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ సుకుమార్ వర్మ,ఎంపీపీ బోదెపు గోవింద్,వైస్ చైర్మన్ గుప్తా, పట్టణ వైసీపీ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర పాల్గొన్నారు.

గీతం వేదికగా 9 నుంచి దివ్యాంగుల క్రికెట్

విశాలాంధ్ర - మధురవాడ: తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) సేవా కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటు చేసిన చైతన్య ప్రవంతి ఆధ్వర్యంలో గీతం వేదికగా డిసెంబర్ 9 నుంచి 13 వతేదీ వరకు దివ్యాంగుల కోసం వీల్ చైర్ సౌత్ ఇండియా క్రికెట్ కప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తానా ఫౌండేషన్ క్రీడా విభాగం కోఆర్డినేటర్ శశాంక్ యార్లగడ్డతెలిపారు. పోటీల నిర్వహణ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పోటీల వివరాలు తెలియజేశారు. దివ్యాంగులలో క్రీడా స్ఫూర్తిని నింపడానికి ఈ తరహా పోటీలు మొదటిసారి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. దివ్యాంగులను ప్రోత్సహించ డానికి సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి క్రీడాకారులకు వసతి సదుపాయాలను, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను ఉచితంగా ఇవ్వడం పట్ల గీతం విశ్వవిద్యాలయానికి తానా అధ్యక్షుడు లావు అంజయ్య చౌదరి, వ్యవస్థాపక చైర్మన్ యార్లగడ్డ వెంకట రమణ, ట్రస్టీ రవి సామినేని అభినందించారు. కాగా ఆంధ్రప్రదేశ్ వీల్ చైర్ అండ్ డిజెబిలిటీ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శామ్యూల్ బెంజిమన్, నిర్వాహక కమిటీ అధ్యక్షుడు రుక్మాకర రావు, కార్యదర్శిరామన్ సుబ్బారావు మాట్లాడుతూ సాధారణ క్రికెట్ పోటీల తరహా లోనే దివ్యాంగుల క్రికెట్ పోటీలు ఉంటాయని, ఆంధ్ర ప్రదేశ్ లో గణనీయ సంఖ్యలోనే దివ్యాంగు క్రికెట్ లో రాణిస్తున్నారని, మిగిలిన వారికి ప్రస్తుత పోటీలు స్ఫూర్తిని అందించగలవన్నారు. గీతం క్రికెట్ స్టేడియంలో జరిగే పోటీలకు దక్షిణ భారత దేశంలోని కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుంచి 120 మందికి పైగా దివ్యాంగ క్రికెటర్లు హజరవుతున్నారని వెల్లడించారు. బిసిసిఐ కి అనుబంధంగా గల భారత వీల్ చైర్ క్రికెట్ అసోసియేషన్ తదితర సంస్థల సహకారంతో తొలిసారిగా విశాఖలో నిర్వహిస్తున్న దివ్యాంగుల క్రికెట్ పోటీలకు తానా సహకారం మరువలేనిదన్నారు.

డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

- జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జిల్లాలో ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకూ నిర్వహించనున్న డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ఈ పరీక్షకు 7535 మంది ఉద్యోగులు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరి కోసం 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రోజుకు రెండు పూటలా పరీక్ష ఉంటుందని వివరించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ఏపీపీఎస్సీ గైడ్‌లైన్సులో పేర్కొన్న పుస్తకాలు తప్ప మిగతా పుస్తకాలను అనుమతించరాదన్నారు. పరీక్ష కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్, స్మార్ట్ వాచెస్, ఇతర స్మార్ట్ పరికరాలను తీసుకురాకూడదని ఆయన తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు స్క్రైబ్ వినియోగించినట్లైతే అదనపు సమయం కేటాయిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించాలని చీఫ్ సూపరింటెండెంట్ లకు ఆదేశించారు. పరీక్ష సమయానికి అరగంట ముందు కేంద్రాలకు అభ్యర్థులు హాజరు కావాలన్నారు. పరీక్ష నిర్వహించబడు రోజున విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, త్రాగు నీరు వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. పరీక్షా కేంద్రానికి చేరుకునేలా అభ్యర్థుల అవసరాలను బట్టి బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ప్రశ్నాపత్రాలు చేరవేత మొదలుకొని పరీక్ష పూర్తయ్యాక బండిల్స్ ను ఏపీపీఎస్సీకి చేరవేసే వరకు నిబంధనలను అనుసరించి పనిచేయాలని లైజనింగ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్‌లకు ఆయన సూచించారు. ఈ పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా యూపీఎస్సీ నిర్వహించబోతున్న కంబైన్డ్ రిక్రూట్మెంట్ పోటీ పరీక్ష 11 వ తేదీన ఒకరోజు జరుగునని అన్నారు. ఈ పరీక్షకు జిల్లాలో 397 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి ఎం.బాలరాజు, ఎగ్జామ్ సెల్ సూపరింటెండెంట్ మధుబాల, ఏపీపీఎస్సీ అధికారులు, జీవీఎంసీ, పోలీస్, మెడికల్, ఈపిడిసిఎల్, ఆర్టీసీ, వివిధ కాలేజీల లైజనింగ్ ఆఫీసర్లు, రెవెన్యూ నంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ

విశాలాంధ్ర - నాతవరం: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని నాతవరం ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రణాళిక తయారీపై రెండో రోజు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీలో 29 శాఖల పనితీరుపై అధ్యాయనం చేయాలన్నారు. ఆయా శాఖలు చేసే పనుల్లో పారదర్శకత ఉండేలా పంచాయతీ పాలకవర్గం, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ఆయా శాఖలు చేసే పనుల్లో పారదర్శకత ఉండేలా పంచాయతీ పాలకవర్గం, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ప్రధానంగా వీధులను అభివృద్ధి చేయుట, పారిశుద్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరుచుట, విద్యుత్ బిల్లులు, ఇంటి పన్నుల తదితర అంశాలే కాకుండా ఆదాయ వనరులపై దృష్టిసారించాల న్నారు. గ్రామాల్లో అనేక ఆదాయ వనరులు ఉన్నప్పటకీ వాటిపై దృష్టిసారించక ప్రభుత్వం ఇచ్చే నిధులపై ఆధారపడుతున్నామని తెలిపారు.

సీఐటీయూ జిల్లా 12వ మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - మునగపాక: సీఐటీయూ అనకాపల్లి జిల్లా 12వ మహాసభలు ఈనెల 18, 19 తేదీల్లో పరవాడలో నిర్వహించే సభలను జయప్రదం చేయాలని మునగపాకలో సీఐటీయూ ఆధ్వర్యంలో గోడపత్రిక ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి శ్రీనివాసరావు, మండల నాయకులు ఎస్.బ్రహ్మాజీ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక సమస్యలపై సమరశీల పోరాటాలను చేస్తుందన్నారు. కేంద్ర బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ప్రభుత్వ రంగాన్ని నాశనం చేస్తుందన్నారు. కార్మిక చట్టాలను మార్చివేసి,దేశ సంపద అంబానికీ,ఆదానీకి కట్టబెడుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ కార్మిక విధానాలకి వ్యతిరేకంగా భవిష్యత్ పోరాటాలు రూపకల్పన చేయనున్నట్టు తెలిపారు. ఈ నెల 18వ తేదీ ఆదివారం పరవాడలో జరిగే భారీ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభలో కార్మిక వర్గం యావత్తు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ గోడ పత్రిక ఆవిష్కరణలో పెంటకోట సత్యనారాయణ, కాంట్రేగుల రాము, ఆళ్ల మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మృత్యవుతో పోరాడి ఓడిన విజ్ఞాన్ విద్యార్థిని శశికళ

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో గుంటూరు నుంచి రాయఘడ ఎక్స్‌ప్రెస్ కింద పడి తీవ్రగాయాలైన శశికళ మృత్యవుతో పోరాడి షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఒక్కగానొక్క కూతురు మృతి ఆ తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగిల్చింది. కూతురు శశికళ మృతితో తండ్రి సూరిబాబు కన్నీటి పర్వంతమయ్యారు. ఒకే ఒక్కకూతురు నాకు ఇంకెవరూ లేరు. కూతురు ఇక లేదు అన్న ఆలోచనని తట్టుకోలేకపోతున్నాను. ఎంసిఎ మొదటి సం చదువుతుంది. రెండురోజులలో హాస్టలులో జాయిన్ చేద్దామనుకున్నా ఇంతలోనే ఇలా జరిగిపోయిందని తల్లిదండ్రుల రోధన కలచి వేస్తోంది. శశికళ మృతదేహాన్ని అంబులెన్స్‌లో అన్నవరం తరలించారు. కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి నుంచి ఎంసిఎ విద్యార్థిని మృతదేహాన్ని అంబులెన్స్‌లో అన్నవరం దరి గల గోపాలపట్నం గ్రామానికి తరలించారు. స్నేహితురాలు విగతజీవిగా వుండడం చూసి సహచర విద్యార్థినీలు రోధిస్తున్నారు. నడుము ఎముక విరిగి ముక్కలు అవడంతో ఆ ముక్కలైన ఎముక యూరిన్ వచ్చే పైపు గుచ్చుకోవడంతో యూరిన్ రక్తము బయటకు పోవడం వల్ల ఇన్ఫెక్షన్ కూడా అయిందంటూ డాక్టర్ వేగు అవినాష్ చెప్పారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన పంచకర్ల

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గుంటూరులో క్యాంప్ కార్యాలయంలో విశాఖ పట్నం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య శాఖ మంత్రి విడదల రజనిని గురువారం మర్యాద పూర్వకంగా జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు, భీమిలి నియోజకవర్గం పరిశీలకులు, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, కాశి విశ్వనాధ కలిశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులుగా నూతనంగా నియమించబడిన పంచకర్ల రమేష్ బాబుకి మంత్రి విడుదల రజిని శుభాకాంక్షలు తెలిపారు.

అదనపు విధులు అప్పగించడం తగదు

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలోని 24 పంచాయతీలలో అదనపు విధులకు 7 గురు డిడిఓ కార్యదర్శులు విధులు చేపట్టేందుకు కొంతమంది సుముకత చూపడం లేదు. ప్రజా పరిపాలన సౌలభ్యంగా సాగేందుకుగాను మండల ప్రజా పరిషత్ వారం కిందట 7 గురికి అదనపు బాధ్యతలు అప్పగించింది. అయితే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పంచాయతీతో పాటు అదనంగా ఒక్కొక్క సెక్రటరీకి 3 రెండు నుండి 4 వరకు పంచాయతీలను అప్పగించడం వలన విధులు కొనసాగించడం సాధ్యం కావడం లేదని వాపోతున్నారు. మండల పరిషత్ అధికారులు ఇప్పటికైనా పునరాలోచించి చేర్పు మార్పులు చేస్తే విధులకు వెళ్లే అవకాశం ఉంటుందని సెక్రటరీలు కోరుతున్నారు.

16న యువహో మెగా వాలీబాల్ టోర్నమెంట్

విశాలాంధ్ర - సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసువారి ఆధ్వర్యంలో జీకేవీధి మండలం సీలేరుపోలీస్‌స్టేషన్ పరిధిలో గల గుమ్మిరేవుల పంచాయతీ మాదిగమల్లు గ్రామంలో ఈ నెల 16వ తేదీన యువహో మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని సీలేరు ఎస్సై రామకృష్ణ వెల్లడించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.25 వేలు, 2వ బహుమతిగా రూ.15 వేలు, మూడవ బహుమతిగా రూ.10 వేలు ఇవ్వడంతో పాటు మొదటి మూడు స్థానంలో ఉన్న జట్లకు షీల్డ్‌లు అందజేస్తామన్నారు. ఈ టోర్నీలో పాల్గనే ప్రతి జట్టుకు వాలీబాల్ కిట్టు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామం నుండి వాలీబాల్ టీంలు ముందుగానే ఈనెల 14వ తేదీ లోపు వారి యొక్క వివరాలు పోలీస్‌స్టేషన్‌లో అందించాలన్నారు. ఒక టీంలో ఉన్న వ్యక్తులు మరొక టీంలో ఆడరాదన్నారు. ఫైనల్‌కు చేరుకున్న రెండు జట్లకు డ్రెస్ కోడ్ పంపిణీ చేయబడుతుందన్నారు. 16వ తేదీన పోలీసుల ఆధ్వర్యంలో మెగా సంజీవని మెడికల్ క్యాంపు, నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మెడికల్ క్యాంపుకు చిన్నపిల్లల వైద్య నిపుణులు, గైనకాలజిస్ట్,(స్త్రీ సంబంధిత నిపుణులు), జనరల్ ఫిజీషియన్(సాధారణ వ్యాదుల నిపుణులు), కంటి వైద్య నిపుణులు హాజరవుతారన్నారు. ఈ క్యాంపుకు హాజరయ్యే వారందరికీ భోజనం ఏర్పాట్లు చేయడం జరిగిందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకుని ఈ యొక్క కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

విశాలాంధ్ర - మాకవరపాలెం: ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. గురువారం మాకవరపాలెం మండల కేంద్రంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాలికి గాయమైనప్పటికీ వీల్‌చైర్‌లోనే ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి ప్రజల యొక్క సమస్యలు నేరుగా తెలుసుకున్నారు. ప్రజల యొక్క సమస్యలు విని వెంటనే సమస్యలు తీర్చాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఈ మూడున్నరేళ్ల కాలంలో 99 శాతం నెరవేర్చామన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులు సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రుత్తల సత్యనారాయణ, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు రుత్తల వాసు, నాయకులు భద్రాచలం, ఎంపిటిసి రుత్తల సర్వేశ్వరరావు, లచ్చన్నపాలెం మాజీ సర్పంచ్ వెంకినాయుడు, కోపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ రాజారావు, తహశీల్దార్ ప్రసాదరావు, ఎంపిడిఒ అరుణశ్రీ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

అనకాపల్లి జోన్‌లో మౌలిక వసతులు కల్పిస్తాం

జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు

విశాలాంధ్ర - అనకాపల్లి అనకాపల్లి జోన్‌లో మౌలిక వసతులు కల్పిస్తామని జీవిఎంసి కమిషనర్ పి. రాజా బాబు తెలిపారు. గురువారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అనకాపల్లి జోన్, 84వ వార్డు పరిధిలోని కొంపాక, అనకాపల్లి మెయిన్ రోడ్డు, మున్సిపల్ ఆఫీస్ పెరుగు శెట్టి వీధి తదితర ప్రాంతాలలో వార్డు

కార్పొరేటర్ మధుశెట్టి చినతల్లితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అనకాపల్లి జోన్ లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వాటిలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్తు మొదలైనవి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జోనల కమిషనర్ ను ఆదేశించారు. వార్డులో ప్లాస్టిక్ అధికంగా ఉందని ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ నిర్వహణలో పిన్ పాయింట్ వారీగా కార్మికులను సర్దుబాటు చేసి నిర్ణీత సమయానికే క్లాప్ వాహనాలు ఉండే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనకాపల్లి మున్సిపల్ కార్పొరేషన్ లో డంపింగ్ యార్డ్ ను పరిశీలించి డంపింగ్ యార్డ్ ఇక్కడ ఉండడం మంచిది కాదని, అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఆర్డీవో తో మాట్లాడి డంపింగ్ యార్డ్ కొరకు మూడు ఎకరాల స్థలం కావాలని అడిగామన్నారు. అనకాపల్లి కలెక్టర్ ఆర్డీవో స్పందించారని తెలిపారు. ప్రధాన వైద్యాధికారి, జోనల్ కమిషనర్ డంపింగ్ యార్డ్ వచ్చేంతవరకు అయా సంబంధిత అధికారులతో మాట్లాడాలని ఆదేశించారు. కొంపాకలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థలో ఉన్నందున దానికి మరమ్మత్తులు చేపట్టాలని ఆరోగ్య కేంద్రం ప్రక్కన ఉన్న ఖాళీ స్థలంలో కళ్యాణ మండపము, కమ్యూనిటీ హాలు నిర్మించాలని, కాలువలు అనుసంధానం సరిగా లేనందున మురుగు రోడ్డుపై నిలుస్తుందని అందుకు కాలువలు అనుసంధానం చేయాలని, ప్రస్తుతం ఉన్న 5 కెఎంఎల్ వాటర్ ట్యాంకు ప్రజల దాహార్తిని తీర్చేందుకు సరిపోనందున 10కెఎంఎల్ ట్యాంకు ఏర్పాటు చేయాలని, ఎస్ సి, ఎస్ టి కోలనీలో మరో 10 కెఎంఎల్ వాటర్ ట్యాంక్ నిర్మించాలని, అలాగే రఘురామ కాలనీలో పార్కు నిర్మించాలని, చల్లపువానిపాలెంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, లక్ష్మి నారయణ లే-అవుట్ లో రోడ్డు, పార్కు అభివృద్ధి చేయాలని, పెరుగు శెట్టి వీధి నుండి రైల్వే స్టేషన్ వెళ్లే రోడ్డు 50 అడుగుల రోడ్డుగా అభివృద్ధి చేయాలని స్థానిక కార్పొరేటర్ కమిషనర్ కు వినతి పత్రం అందించగా కమిషనర్ స్పందిస్తూ కొన్ని ఆమోదం పొంది పనులు జరుగుచున్నాయని, మరికొన్ని పనులు అంచలంచెలుగా అభివృద్ధి చేస్తామని కమిషనర్ బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్జి శాస్త్రి, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, పర్యవేక్షక ఇంజనీరు రామ్మోహన్ రావు, కార్యనిర్వాహకా ఇంజనీర్ చిరంజీవి, డిడీహెచ్ ఎం దామోదరావు, ఎఎంఒహెచ్ రజని, టిపిఎస్ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి హాకీ పోటీలు

విశాలాంధ్ర - నక్కపల్లి: స్థానిక అనకాపల్లి, అల్లూరి, విశాఖపట్నం జిల్లా ల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 బాల బాలికల హాకీ పోటీలు ఘనంగా నిర్వహించారు. మూడు జిల్లాల నుంచి 220 మంది క్రీడా కారులు పాల్గొన్నారని పీ.డీ. కుందూరు రాజు తెలియజేశారు. ఇంచార్జ్ హెచ్. ఎం. అప్పారావు గారి అధ్యక్షతన పీ.డీ. రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి వైస్ ఎం.పి.పి. వీసం నానాజీ గారు, వైస్ సర్పంచ్ వీసం రాజు గారు,పాఠశాల కమిటీ చైర్మన్ కర్రి పద్మ గారు, %ూ+ఖీ% సెక్రటరీ ఆళ్ల శేఖర్ గారు, అసోసియేషన్ కార్యదర్శి కిరణ్ గారు హాజరై పోటీలను ప్రారంభించారు. వైస్. ఎం.పి. పి. వీసం నానాజీ గారు మాట్లాడుతూ... ఇంత పెద్ద టోర్నమెంట్ కు నక్కపల్లి వేదిక కావడం చాలా గర్వంగా ఉందని, నక్కపల్లి క్రీడలకు నిలయం అని, ఇక్కడ క్రీడా కారులంతా జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలు లో రాణించి గొప్ప ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఉదయం నుంచి జరిగిన పోటీలులో నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు టీమ్ మొదటి స్థానం కైవసం చేసుకోగా,,,, ద్వితీయ స్థానం లో యలమంచిలి సెయింట్ జోన్స్ నిలిచింది. బాలికల విభాగం లో మొదటి స్థానం నక్కపల్లి జట్టు కైవసం చేసుకోగా ద్వితీయ స్థానం లో యలమంచిలి జట్టు నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ప్రత్యేక అతిధులు గా నక్కపల్లి రిజిస్టర్ ఆఫీస్ రిజిస్ట్రార్ జిలాని బేగం గౌస్య గారు, వైస్ ప్రెసిడెంట్ వీసం రాజు గారు హాజరై గెలుపొందిన జట్లుకు బహుమతులు అందించారు. నక్కపల్లి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కాబడిన క్రీడా కారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బంగారురాజు, కొల్లాటి నానాజీ, హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, కార్యదర్శి తాతాజీ, కోచ్ రాంబాబు, రంజిత్, సెక్రటరీ ఆళ్ళ శేఖర్, రమేష్ నాయుడు, కిరణ్, సింహాచలం, కోచ్ దీక్షిత్,సాయిబాబు, ఉపాధ్యాయులు బాబూజీ, సత్యవతి, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నేటి నుంచి నైట్ సర్వీసుల పునరుద్ధరణ

విశాలాంధ్ర - సీలేరు: గత వారం రోజులుగా మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో ఆర్టీసి అధికారులు ముందు జాగ్రత్తగా రద్దు చేసిన నైట్ సర్వీసులను ఈ నెల 9 నుండి సీలేరు మీదుగా నడిచే అన్ని నైట్ సర్వీస్‌లను పునరుద్ధరించారు. వీటికి రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉంటుందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత ప్రభుత్వం వలన జరుగుతున్న కష్ట నష్టాలను వివరిస్తూ ప్రజలలో ఉంటూ వచ్చే ఎన్నికలలో వారు తెలుగుదేశం పార్టీకి ఎందుకు ఓటు వేయాలో వివరిస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమం "ఇదేమి కర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమాన్ని నిర్వహించారు. 75వ వార్డులో శీకువానిపాలెం, సీతానగరం గ్రామాలలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వార్డు అధ్యక్షులు నమ్మి అప్పారావు,నామాల పెంటయ్య, మొల్లి రమణబాబు, ఉరుకుటి వెంకట రావు, పాము తాతారావు, నంబారు సింహాద్రి, మొల్లి సోము నాయుడు ,మొల్లి శ్రీనివాస్,కాకినాడ అప్పల రాజు, నక్క మహాలక్ష్మి ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హరిత సాంకేతిక పరిజ్ఞానంతో పర్యావరణ పరిరక్షణ

విశాలాంధ్ర - మధురవాడ: ప్రపంచలోని కాలుష్య తీవ్రతను తగ్గించాలంటే హరిత సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేయడం ఒక్కటే ప్రత్యామ్నాయ మార్గమని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధికి హరిత సాంకేతిక పరిజ్ఞానం అనే అంశం పై గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ పర్యావరణ శాస్త్ర విభాగం నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం తేది.08.12.2022న ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఇజ్రాయల్, బ్రెజిల్ తదితర దేశాలలో జీవ ఇందనం వాడుతుండగా మన దేశంలో వ్యవసాయ వ్యర్థాలను అనవసరంగా తగలబెట్టడం ఢిల్లీ పరిసరాలలో కాలుష్యానికి దారితీస్తోందన్నారు. హరిత సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసే క్రమంలో ఆ పరిజ్ఞానం ఆర్థికంగా ప్రజలకు అందుబాటులోకి తేగలమా లేదా అన్న విషయాన్ని పరిశీలించాలన్నారు. సైన్స్, ఇంజనీరింగ్, మేనేజ్మెంట్ తదితర విభాగాల మధ్య సమన్వయం, పరస్పర అవగాహన ఉన్నప్పుడే అందుబాటు ధరలో లభించే హరిత సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేయవచ్చునన్నారు. ప్రకృతి మనిషి ఆధిపత్య అన్నిమార్లు సాధ్యపడదని, మితిమీరిన సహజ వనరుల వినియోగం వల్ల జంతువుల నుంచి మానవాళికి వైరస్ లు సంక్రమిస్తున్నాయన్నారు. గీతం విశ్వవిద్యాలయంలో వచ్చే సంవత్సరం నుంచి సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ సైన్స్ కోర్సు ప్రారంభించనున్నట్లు వి.సి. ప్రకటించారు. అలాగే రూ.50 కోట్లతో ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రం నెలకొల్పుతున్నామని వెల్లడించారు. ఒడిస్సా లోని సంబల్పూర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సంజత్ కుమార్ సాహూ మాట్లాడుతూ జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ, వాహనాల కారణంగా పెరుగుతున్న కాలుష్య తీవ్రతకు ఆమ్లవర్షాలు,మంచు ఖండాలు కరగడం, జలచక్రంలో మార్పులు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. సహజ వనరులను భవిష్య తరాలకు అందించాలంటే ప్రతి ఒక్కరు పర్యావరణ చైతన్నంతో జీవనశైలి మార్చుకోవాలన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇంకా పాత సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ ఉండటం కాలుష్య తీవ్రతకు కారణమవుతోందని తెలిపారు. హరిత సాంకేతి పరిజ్ఞానం శక్తి ఉత్పాదన రంగంలో, భవన నిర్మాణాలలో, వాహన తయారీలో అత్యవసరమని అభిప్రాయ పడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్

ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి మాట్లాడుతూ 12 యుజి, 12 పిజి కోర్సుల ద్వారా రెండు వేలమంది సైన్స్ కోర్సులను అభ్యసిస్తున్నారని, 500 మంది పరిశోధక విద్యార్థులు వివిధ అంశాలపై అధ్యయనాలు జరుపుతున్నారని తెలిపారు. గీతం పర్యావరణ శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ వి.సరిత తమ విభాగంలో జరుగుతున్న పరిశోధనలు, కన్సల్టెన్సీ ప్రాజెక్టులను తెలియజేశారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ కిరణ్మయి రెడ్డి సదస్సు ముఖ్య ఉద్దేశ్యాన్ని, సదస్సులో రెండు రోజుల పాటు చర్చించే అంశాలను వివరించారు. కార్యక్రమంలో గీతం అకడమిక్ ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్, గీతం కేంపస్ లైఫ్ ప్రొ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గౌతమ రావు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడోసారి విజయం చరిత్ర: ఎమ్మెల్సీ మాధవ్

విశాలాంధ్ర - గాజువాక : కంచుకోట లాంటి గుజరాత్‌లో బీజేపీ వరుసగా ఏడోసారి విజయం సాధించి చరిత్ర సృష్టించిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ పివియన్ మాధవ్ అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ మాధవ్ ఆధ్వర్యంలో బాణా సంచా కాల్చి, సంబరాలు చేసుకున్నారు. ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో గుజరాత్ విజయం సాదించడంతో డబుల్ ఇంజన్ సర్కారుతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని ఎమ్మెల్సీ మాధవ్ పేర్కొన్నారు. ఏపీలో కూడా భారతీయ జనతాపార్టీ రాకతోనే అభివృద్ధి ఆదారపడి ఉందన్నారు. గుజరాత్ విజయం దేశ వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలలో ఆనందాన్ని నింపిందని తెలిపారు. ఏపీ బీజేపీ శాఖ నుంచి గుజరాత్ ప్రజలకు మాధవ్ శుభాకాంక్షలు తెలియజేసారు.

భక్త జనసందోహంతో కిటకిటలాడిన వన్‌టౌన్

విశాలాంధ్ర -వన్ టౌన్: విశాఖపట్నం పాత నగరం అంతట జన సందోహం కిటకిటలాడింది. విశాఖ మేరీ మాత భక్తులు, కనక మహా లక్ష్మి అమ్మవారి భక్తులతో పులకరించి పోయింది. విశాఖ పురి మేరీ మాత (కొండ గుడి) పండగ కావడంతో మరొక ప్రక్క కనక మహాలక్ష్మి అమ్మవారీ మూడో మార్గశిర గురువారం మాసోత్సవాలు కావడంతో హిందూ, క్రైస్తవ మతలకు చెందిన భక్తులతో టౌన్ కొత్త రోడ్డు, బురుజు పేట, పూర్ణ మార్కెట్ మెయిన్ రోడ్డు, రీడింగ్ రూం, కురుపాం మార్కెట్, పాత పోస్టాఫీసు, ఫెర్రీ రోడ్డు,ప్రాంతాలు భక్తులతో వివిధ రకాల చిల్లర వ్యాపారాలు చేసే వర్తక వ్యాపారుల యొక్క రకరకాల స్టాల్స్ కిటికీటలాడయి, పలు దుకాణాలు స్వచ్ఛంద సంస్థలు భక్తుల సౌకర్యార్థం మంచినీళ్లు, ప్రసాదాలు, అన్న ప్రసాదం ఏర్పాట్లు చేశారు, వివేకానంద స్వచ్ఛంధ సంస్థ కొండ గుడి కి వొచ్చే భక్తుల సౌకర్యార్థం రాత్రి 7 గంటల వరకు మహా అన్నదానాన్ని ఏర్పాటు చేశారు,,ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-మునగపాక: రాష్ట్రంలో వైసీపీ పాలనతో అభివృద్ధి జాడలేదని మునగ పాక టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు అన్నారు. మండలంలో మేలుపాక గ్రామంలో "ఇదేమి కర్మ రాష్ట్రానికి" అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైసీపీ పాలనలో గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నా, మన పిల్లల భవిష్యత్తు బాగుపడాలన్నా మళ్ళీ నారా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కొప్రపాటి వీర రాజశేఖర్, కర్రీ రామ్ నాగేశ్వరరావు, పెతకం శెట్టి రాజనాయుడు, కర్రీ ఉస్తేల్ నాయుడు, బొడ్డేడ వెంకటరమణ, కొత్తపెల్లి రాంబాబు, మండల టీడీపీ సెక్రటరీ పోతిన నాగ శివ, మండల ఐటీడీపీ ఇన్‌చార్జ్ శరగడం యోగి నాగేశ్వరరావు, బీసీ సాధికార సమితి డైరెక్టర్ యల్లపు శ్రావణ్ కుమార్, బొడ్డేడ గంగాధర్, సూరిశెట్టి శివాజీ, కాండ్రేగుల దిలీప్ తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన నేతలతో నాదెండ్ల మనోహర్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రానున్న ఎన్నికల్లో జనసేన క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే కృషిలో భాగంగా పిఎసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ విశాఖ జిల్లా జనసేన నేతలతో ఓ హోటల్లో సమావేశమయ్యారు. గాజువాక ,అనకాపల్లి, భీమిలి, చోడవరం, విశాఖ ఉత్తర, దక్షిణ ,తూర్పు, పశ్చిమ నియోజకవర్గం నేతలతో రానున్న ఎన్నికలపై జనసేన అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. త్వరలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు వ్యవహరించాల్సిన పరిస్థితులపై కూడా చర్చించి నట్లు తెలిసింది. వచ్చే ఎన్నికల్లో వైసీపీ పార్టీని ఓడించడమే లక్ష్యంగా జనసేన పనిచేయాలని అందుకోసం అన్ని నియోజకవర్గాల్లో బూతు స్థాయిలో జనసేన నేతలను సిద్ధం చేసుకోవాలని మనోహర్ దిశ నిర్దేశం చేసినట్లు తెలిసింది. ఈ భేటీలో జనసేన నేతలు శివశంకర్, కోన తాతారావు, పరుచూరి భాస్కరరావు, పసుపులేటి ఉషా కిరణ్, పంచకర్ల సందీప్, వి ఎస్ ఎన్ రాజు తదితరులు పాల్గొన్నట్లు సమాచారం.

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోండి: వీఎమ్మార్డీఏ

విశాలాంధ్ర - విశాఖ: "జగనన్న స్మార్ట్ టౌన్ షిప్స్" పథకంలో భాగంగా మధ్య తరగతి ప్రజలకు సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా వీఎమ్మార్డీఏ పరిధిలో అన్ని మౌలిక వసతులతో డీటీసీపీ ఆమోదం పొందిన ఎంఐజీ లేఔట్లను వి.ఎం.ఆర్.డి.ఏ వారు అభివృద్ధి చేస్తున్నట్లు మెట్రో పాలిటన్ కమిషనర్ తెలిపారు. ఇందులో భాగంగా ఆనందపురం మండలం, పాలవలస గ్రామం నందలి సర్వే నంబర్లు : 56/2, 59/1పి, 80/1పి, 82పి లలో గల ఎ. 54.94 సెంట్ల లేఔటు నందు 446 ప్లాట్లను విక్రయించు నిమిత్తము డీటీసీపీ ఆన్లైన్ వెబ్ పోర్టల్ www.migapdtcp.ap.gov.in ద్వారా ప్రజల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తూ, నోటిఫికేషన్‌ను తేదీ: 27.04.2022 న జారీ చేసినట్టు తెలిపారు. రాష్ట్ర స్థాయి కమిటీ వారి నిర్ణయం మేరకు సదరు లేఔటు నందు చదరపు గజమునకు ధర రూ: 18,000/- గా నిర్ణయించినట్టు తెలిపారు. కాగా నిర్ణీత మార్గదర్శకాలననుసరించి తేదీ: 30.11.2022 నాటి వరకు ప్లాటు ధరలో 10 % ప్రారంభ ధర చెల్లింపుతో 71 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించడమైందన్నారు. 'జగనన్న స్మార్ట్ టౌన్ షిప్స్' పథకాన్ని మధ్య తరగతి ప్రజలకు మార్కెట్ ధర కన్నా తక్కువ ధరలో అన్ని మౌలిక వసతులతో కూడిన సొంత ఇంటిని అందించే లక్ష్యంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తీర్చిదిద్దిందన్నారు.

సదరు లక్ష్యాన్ని నెరవేర్చేదిశగా, ఈ పథకం ప్రజలకు మరింత చేరువ చేసే దృశ్య చదరపు గజమునకు గతంలో నిర్ణయించిన ధర రూ: 18,000/- ను మరింతగా తగ్గిస్తూ ప్రస్తుతం ధరగా చదరపు గజమునకు రూ: 14,500/- గా నిర్ణయించడమైందన్నారు. ప్రస్తుతం నిర్ణయించిన చదరపు గజము ధర రూ: 14,500/- మొత్తం లేఔట్లోని 446 ప్లాట్లకు వర్తించునని తెలిపారు. విశాఖపట్నం నగరానికి అత్యంత చేరువలో జాతీయ రహదారికి సమీపంలో అభివృద్ధి చేయుచున్న పాలవలస లేఔటు విక్రయ ధరలో వి.ఎం.ఆర్.డి.ఏ అందిస్తున్న యీ తగ్గింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అగ్ని ప్రమాదంలో పూరిళ్లు దగ్ధం

విశాలాంధ్ర -రాంబిల్లి: మండలంలో వాడపాలెంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో 5 పూరిళ్లు దగ్ధమైన ఘటనలో రూ.6 లక్షలు నష్టం వాటిల్లినట్టు ఫైర్ అధికారుల తెలిపారు.గ్రామానికి చెందిన ఈ ఇళ్లలో ఒక పూరింటిలో ఉన్న కట్టెల పొయ్యి వలన మంటలు ఎగసిపడటంతో పక్కన ఉన్న మిగతా ఇళ్లకు కూడా వ్యాపించి నట్లు ఫైర్ సిఐ రాంబాబు తెలిపారు.ఈ సం ఘటపై యలమంచిలి ఫైర్ ఆఫీసుకి సమాచారం వచ్చిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ సిఐ రాంబాబు ఆధ్వర్యంలో సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమణ, సిబ్బంది బంగారురాజులు మంటలు అదు పుచేశార న్నారు. బాధితులు తమను ప్రభుత్వం ఆదుకోవాలంటూ కోరారు.

శిక్షణతో ఉపాధికి నిచ్చెన

జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: శిక్షణతోనే ఉపాధికి నిచ్చెనని జివిఎంసి కమిషనర్ పి రాజాబాబు పేర్కొన్నారు. గురువారం ఆయన ముడసర్లోవలోని హెచ్పిసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను సందర్శించారు. ఈ

సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మంచి శిక్షణ ద్వారా ఉపాధితో పాటు ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని మారుతున్న కాలాన్నికనుగుణంగా మార్కెట్లో డిమాండ్ ను బట్టి వస్తువులను తయారు చేసి విక్రయించడం ద్వారా ఉపాధి పొందవచ్చు అని అన్నారు. ప్రస్తుతం ముడసర్లోవలోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో 48 రకాల వృత్తులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఇందులో స్త్రీ, పురుషులు కూడా శిక్షణ పొందుతున్నారని వీరికి వేరు వేరు హాస్టల్ సదుపాయం కలదని కమిషనర్ వివరించారు. 2016 సంవత్సరం నుండి నిర్వహిస్తున్న ఈ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందేందుకు నామమాత్రపు ఫీజు హెచ్పిసిఎల్ వారు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో శిక్షణ పొందిన ఎంతోమంది స్వయం ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ పర్యటనలో అదనప కమిషనర్లు

వై శ్రీనివాసరావు, డాక్టర్ వి సన్యాసిరావు, డిసిఆర్ ఫణిరామ్, హెచ్పీసీఎల్ స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వీధిలో ఆడుకుంటూ తప్పిపోయిన చిన్నారిని గంటలు వదలనే పోలీసులు తల్లిదండ్రులకు చేర్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. డైల్ 112 కాల్ కు కే.జి.హెచ్ దగ్గరలోని సాలిపేట వద్ద 4 సంవత్సరాల వయసు గల ప్రత్యుష అను బాలిక తప్పిపోయినట్లు వచ్చిన ఫిర్యాదు తో కంట్రోల్ రూమ్ సిబ్బంది మహా రాణి పేట రక్షక్ హెచ్.సి నాగరాజు బ్లూకోట్స్ పీసీ లు అజారుద్దీన్, శ్రీధర్ లకు సమాచారం అందించారు, వారు తక్షణమే స్పందించి సదరు ప్రాంతానికి చేరుకొని, చుట్టుప్రక్కల విచారణ చేసి, సంబంధిత సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించి సకాలంలో బాలికను గుర్తించి, బాలిక తల్లిదండ్రులకు సురక్షితముగా తిరిగి అప్పగించారు. తక్షణమే అప్రమత్తమై సదరు బాలికను గుర్తించి,సురక్షితముగా తల్లిదండ్రులకు అప్పగించిన సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్ శ్రీకాంత్ అభినందించారు.

క్రిస్మస్ వేడుకలలో మ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సీతమ్మధారలో గల "ది వైన్యార్డ్ ఫెలోషిప్" చర్చ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ గారు పాల్గొన్నారు. కార్యక్రమంలో వంశీ గారు మాట్లాడుతూ అందరికీ అడ్వాన్స్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. యేసు క్రీస్తు యొక్క కరుణా కటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, సాటి మనిషుల పట్ల స్వార్థాన్ని వీడి ప్రేమ కలిగి జీవించమని చెప్పిన ప్రభు మానవ జాతికి ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్ జీవన్, అరుణ్ కుమార్ మహంతి, సునిత్, సెరెనా, గోవింద్, శేఖర్, హరి పాల్గొన్నారు.